క్లుప్తంగా

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

జంగారెడ్డిగూడెం: స్థానిక సీఎస్‌టీఎస్ కళాశాలలో బీఏ ఆనర్స్ (ఎకనామిక్స్) మొదటి సంవత్సరం చదువుతున్న విభిన్న ప్రతిభావంతుడు కట్టా శివగణపతికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ల్యాప్‌టాప్ అందింది. సోమవారం ఏలూరులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ విద్యార్థికి ఆ ల్యాప్‌టాప్‌ను అందించారు. ఈ సందర్భంగా కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు శివగణపతికి ల్యాప్‌టాప్ వినియోగించే విధానాన్ని వివరించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ కడిమి రమేష్

కామవరపుకోట: సాగిపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని జెడ్పీటీసీ, జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ కడిమి రమేష్ మంగళవారం పరిశీలించారు. అటెండెన్స్, స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. విద్యార్థులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరఫున వారికి అందాల్సిన పోషకాహారం సరఫరా వివరాలను, స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం, నాడు నేడు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండుగోల సుబ్బారావు, ప్రధానోపాధ్యాయులు ప్రియదర్శిని పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఎలీజా పరామర్శ



రవిచంద్రను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

లింగపాలెం: ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కలరాయనగూడెం గ్రామానికి చెందిన చలగుళ్ల రవిచంద్రను మంగళవారం చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా పరామర్శించారు. తన పొలంను వాయనందన ప్రసాద్ అనే వ్యక్తి ట్రాక్టర్‌తో దుక్కిదున్నాడని, అదేంటని అడిగితే తనపై దాడి చేసి గాయపరిచాడని రవిచంద్ర వాపోయాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు. ఎమ్మెల్యే ఎలీజాతో పాటు కలరాయనగూడెం సర్పంచ్ చలగుళ్ల రవిబాబు, లింగపాలెం మండల వైఎస్సార్ సీపీ నాయకులు మందలపు సాయిబాబు, ముసునూరి వెంకటేశ్వరరావు, ఉప్పలపాటి వరప్రసాద్, రావి కొండయ్య, సీహెచ్ సూరిబాబు పరామర్శించిన వారిలో ఉన్నారు.

మైక్రోస్కోప్ బహూకరణ

కామవరపుకోట: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ అధ్యక్షుడు వేముల సాయిబాబు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక హైస్కూల్ ప్లస్ ఉన్నత పాఠశాలకు రూ.10 వేల విలువ కలిగిన మైక్రోస్కోప్, 12 స్పోటర్స్, 11 చార్టులు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమా సుందరికి అందజేశారు. మానవత సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



చింతలపూడి సీపీఐ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

చింతలపూడి: ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు చింతలపూడిలో మంగళవారం ఘనంగా జరిగాయి. సీపీఐ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ పతాకాన్ని ఏరియా ఉపాధ్యక్షుడు కంచర్ల గురవయ్య ఆవిష్కరించారు. రాఘవాపురం గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గంధం అంజమ్మ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు తొర్లపాటి బాబు, కార్యదర్శి బుచ్చిబాబు మాట్లాడుతూ ఏఐటీయూసీ చేసిన పోరాటాల వల్ల అనేక హక్కులను సాధించుకోగలిగామన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కాలరాస్తుందని ఆరోపించారు.

మున్సిపల్ కార్మికులకు అండగా ఉంటాం

జంగారెడ్డిగూడెం: మున్సిపల్ కార్మికులకు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని ఏఐటీయూసీ జెండాను ఎగురవేశారు. పట్టణంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కె.విఘ్నేష్ అధ్యక్షతన ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద మండల కార్యదర్శి కుంచె వసంత రావు ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు.

పట్టణాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు



జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణాభివృద్ధికి అధికారులు, పాలకవర్గం సమన్వయంతో పనిచేసి పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో అన్ని వార్డులు సమానంగా అభివృద్ధి చేస్తామని ఇందులో వివక్షతకు తావు లేదన్నారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం, అధికారులతో పాటు ప్రజల సహకారం కూడా అవసరం అన్నారు.

కౌన్సిలర్‌లు లేవనెత్తిన సమస్యలు ఇవి

- పట్టణంలో పలు అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్‌లు టెండర్లు వేస్తున్నారని, కాని పనులు చేపట్టడం లేదని, వెంటనే పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పీపీఎస్ చంద్రరావు కోరారు.
- స్థానిక బైనేరు వద్ద గల శివాలయం వద్ద ఉన్న డంపింగ్ యార్డు వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వలవల తాతాజీ తెలిపారు. రానున్నది కార్తీక మాసం కావడంతో నిత్యం వేలాది మంది భక్తులు శివాలయాన్ని దర్శించుకుంటారని, అక్కడ డంపింగ్ యార్డు వల్ల పారిశుధ్యం, దుర్గంధం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.
- నవభారత్ పామాయిల్ కర్మాగారం నుంచి వెలువడే రసాయనిక వ్యర్థ జలాలు వల్ల పట్టణంలో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఇందిరా ప్రియదర్శిని, ముప్పిడి అంజి, పీపీఎస్ చంద్రరావు కోరారు. దీనిపై కమిషనర్ భవానీ ప్రసాద్ మాట్లాడుతూ సమస్య తీవ్రతను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.
- పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రెయిన్ల అవసరం ఉందని, వాటి నిర్మాణం పూర్తి చేయాలని వైస్‌చైర్మన్ కంచర్ల వాసవీరత్నం కోరారు.
- బాణసంచా దుకాణాలు ఏటా ఏర్పాటు చేసే రాములమ్మ చెలకలో వద్దని, అ ప్రాంతంలో థియేటర్‌లు, మాల్‌లు, గృహాలు పెరిగాయని, అధిక లోడు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉన్నాయని, అక్కడ కాకుండా వేరొక చోట ఏర్పాటు చేయాలని దొంతు మాధవ్ చైర్‌పర్సన్‌కు విన్నవించారు.
- జగనన్న కాలనీలో ఇప్పటికే చాలా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, త్వరితగతిన అక్కడ మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని చిటికెల అచ్చిరాజు కోరారు.
- పలు విద్యుత్‌లైన్‌లు ప్రమాదకరంగా ఉన్నాయని, అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించాలని ఎల్.వెంకటేశ్వర్లు కోరారు. కాగా సమావేశం పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపింది. సమావేశంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అట్లతద్ది వేడుక



గంగవరంలో వాయన పూజలు నిర్వహిస్తున్న దంపతులు

కొయ్యలగూడెం: మండల వ్యాప్తంగా మంగళవారం అట్లతద్ది వేడుక ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఉపవాస దీక్షలు నిర్వహించి, అనంతరం చంద్ర దర్శనంతో దీక్ష విరమించి అల్పాహారం స్వీకరించారు. తద్దులు తీర్చబడిన మహిళలకి సంపూర్ణ స్త్రీతత్వం సిద్ధిస్తుందని పురాణాలలో పేర్కొనబడినట్లు అర్చకులు పేర్కొన్నారు. గౌరీదేవి వ్రతాలు ఆచరించిన అనంతరం వాయన పూజలు నిర్వహించి పదకొండు మంది ముత్తైదువులకు వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యువతులు ఊయలలు ఊగారు.

ఆరోగ్య రక్షతో పేదల ఆరోగ్యానికి భరోసా



వృద్ధులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భరోసా కల్పిస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ద్వారకాతిరుమలలోని పీహెచ్‌సీ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని తలారి సందర్శించి, రోగులకు అందుతున్న సేవలు, సౌకర్యాలను పరిశీలించారు. అలాగే వైద్యులకు పలు సూచనలు, సలహాలనిచ్చారు. అనంతరం పలువురు రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేశారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఖరీదైన వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందిస్తోందన్నారు. పేద, మధ్యతరగతి, ధనిక అనే తేడా లేకుండా అందరికీ మెరుగైన వైద్యం అందించాలన్నదే జగనన్న ముఖ్య ఉద్దేశ్యమని, అందుకే ఈ సురక్షా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇదిలా ఉంటే మండలంలో సురక్ష కార్యక్రమాలు ముగియడంతో పీహెచ్‌సీ వద్ద రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైద్యులు బాలు ప్రకాష్, ప్రవీణ్‌కుమార్, వైద్య సిబ్బందితో కలసి ఎమ్మెల్యే కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంటం స్వర్ణలత, ఎంపీటీసీలు రుద్ర నాగ సూర్యకళ, పెద్దిరెడ్డి రమ్య కుసుమ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అచ్యుత ఏసుబాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, జంగా వెంకట కృష్ణారెడ్డి, శ్రీవారి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు మానుకొండ సుబ్బారావు, మండల సచివాలయాల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, దాసరి ఏసురత్నం, దాకారపు అగ్గియ్య, దాసరి రాంబాబు, ఎంపీడీవో తిరుపతిరావు, తహసీల్దార్ పి.సతీష్ తదితరులున్నారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధికీ ప్రాధాన్యం



పీహెచ్‌సీ వద్ద బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న తలారి

ద్వారకాతిరుమల: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సైతం అధిక ప్రాధాన్యతనిస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ద్వారకాతిరుమల పీహెచ్‌సీ వద్ద రూ.50 లక్షలతో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే తలారి మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి తమ ప్రభుత్వానికి రెండు కళ్లని అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రతి పంచాయతీలోను గ్రామ సచివాయాలు, ఆర్బీకే భవనాలను నిర్మించడమే కాకుండా, నాడు–నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రులను, పాఠశాలలను అభివృద్ధి చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు జగన్ పక్షాన నిలిచి, ప్రతిపక్షాలకు మరోసారి బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్ కుంటం స్వర్ణలత, ఎంపీటీసీలు రుద్ర నాగ సూర్యకళ, పెద్దిరెడ్డి రమ్యకుసుమ, చెలికాని బుల్లియ్య, మానుకొండ ప్రసాద్, ఐసీడీఎస్ సీడీపీవో బ్యూలా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీరాజ్యం, కె.మణి, కార్యకర్తలు మాణిక్యాంబ, పుణ్యవతి, భవానీ తదితరులున్నారు.

చింతలపూడిని కరువు మండలంగా ప్రకటించాలి



తహసీల్దార్ కార్యాయలం వద్ద రైతుల ఆందోళన

చింతలపూడి: చింతలపూడి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి వర్షాభావ పరిస్థితులతో ఎండిపోయిన వరి రైతులను తక్షణం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాయలం ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. మండలంలోని సమ్మెటవారిగూడెం గ్రామంలో ఎండిన వరి చేలను రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతు ప్రతినిధులు పరిశీలించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని రైతులు కోరారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని కోరుతూ తహసీల్దార్ కృష్ణజ్యోతికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో చిట్టూరి అంజిబాబు, రావెళ్ళ హనుమంతరావు, డి సత్యన్నారాయణ, ఎస్.సూర్యకుమార్, రైతులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అండగా నిలవాలి



మంజులూరు సచివాలయాన్ని సందర్శించిన అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ

బుట్టాయగూడెం: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అండగా ఉంటూ సేవలందించాలని అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ అన్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన ముంజులూరులో ఆమె మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది వివరాలపై కార్యదర్శి నాగరాజును అడిగి తెలుసుకున్నారు. సచివాలయ పరిధిలోని గ్రామాలు, వారికి అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతంలోని ప్రజలకు ప్రభుత్వ సేవలు అందేలా చూడాలన్నారు.

జలపాతాన్ని సందర్శించిన అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ దట్టమైన అటవీ ప్రాంతంలో మంగళవారం పర్యటించారు. మారుమూల గ్రామమైన ముంజులూరుతోపాటు ఏనుగు తోగు జలపాతాన్ని సందర్శించారు. సందర్శకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జలపాతం వద్దకు వచ్చే సందర్శకులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల కార్మికుడికి విముక్తి



బాలుడు నాగ తేజకు యూనిఫాం అందిస్తున్న దృశ్యం

కామవరపుకోట: కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చొరవతో ఓ బాల కార్మికుడికి విముక్తి లభించింది. స్థానిక ఎరుకల కాలనీకి చెందిన కమలగిరి నాగతేజ చదువు మానివేసి గేదెలను కాస్తున్నాడు. దసరా సెలవులకు ముందు సచివాలయాల శాఖ ఎస్‌టీసీసీ కోఆర్డినేటర్ టీఎస్ స్నేహన్ ఫీల్డ్ విజిట్‌లో ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే బాలుడిని పాఠశాలలో చేర్పించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. వెంటనే విద్యా సంక్షేమ కార్యదర్శి దుర్గారావు బాలుడు తల్లిదండ్రులు సురేష్, నాగమణిలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. సెలవులు ముగియటంతో బాలుడు నాగతేజను పాతూరులోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. సచివాలయాల శాఖ ఎస్‌టీసీసీ కోఆర్డినేటర్ టీఎస్ స్నేహన్ మంగళవారం పాఠశాలను సందర్శించి ఆ బాలుడికి యూనిఫారం, టై, బెల్ట్, షూస్, పుస్తకాలు అందించారు. బాగా చదువునికి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.నాగేశ్వరరావు, విద్యా సంక్షేమ కార్యదర్శి దుర్గారావు, మహిళా పోలీసు ఎ.రాధ పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతకు పటేల్ కృషి ఎనలేనిది



ద్వారకాతిరుమల: సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద త్రీకే రన్‌ను ప్రారంభిస్తున్న పీఓ సూర్యతేజ



వేలేరుపాడు: సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళులు అర్పిస్తున్న హెచ్ఎం, చిన్నారులు

ద్వారకాతిరుమల: స్వాతంత్రోద్యమంలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడటమే కాకుండా, దేశ ప్రజల సంక్షేమం కోసం అనేక ఉద్యమాలు చేపట్టిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. పటేల్ జయంతి వేడుకలను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి ఎమ్మెల్యే తలారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం సంస్థానాలు భారతదేశంలో విలీనం కావడానికి పటేల్ గట్టిగా కృషిచేశారన్నారు. హైదరాబాద్, జునాఘడ్ లాంటి సంస్థానాలు భారతదేశంలో విలీనం చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, తహసీల్దార్ పి.సతీష్, ఎంపీడీవో తిరుపతిరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐటీడీఏ పరేడ్ గ్రౌండ్‌లో త్రీకే రన్

బుట్టాయగూడెం: ఉక్కు మనిషి సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఐక్యతా రన్‌ను కేఆర్‌పురం ఐటీడీఏ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్ వరకూ రన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ ఐక్యతా పరుగులో అధికారులు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఆయన దేశానికి చేసిన సేవలకు గుర్తుగా ఈ ఐక్యతా పరుగును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. అలాగే పటేల్ జయంతి వేడుకలను మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.

జీలుగుమిల్లిలో...

జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డీఈ ప్రసన్న కుమార్, కళాశాల అధ్యాపకులు బి.ఆంజనేయులు, సీపీ రాజేష్, సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు అధ్యక్షతన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేశ సౌభాగ్యం, సమగ్రత, భద్రత కొరకు సత్య నిష్ఠతో కృషి చేస్తామంటూ విద్యార్థులచే ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్ ఉయికే బొజ్జి, ఇన్చార్జి డీవైఈఓ నీలయ్య, ఏఎంఓ శిరమయ్య, ఎస్‌డీసీ శ్రీనుకుమార్ పాల్గొన్నారు. అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు, జి.రామ్మోహన్, ఎం.ఉషారాణి, వి.శ్రీనివాస్, ధారావతు మల్లేష్, బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏక్తా దివస్

వేలేరుపాడు: జిన్నెలగూడెం ఎఫ్‌పీఎస్ స్కూల్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఏక్తాదివస్ కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు పూనెం సుందర్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రతి విద్యార్థికి వల్లభాయ్ పటేల్ టోపీలను ధరించి, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ నిర్వహించారు.

కారుని రథం ఢీకొట్టిన ఘటనపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి రథం కారును ఢీకొట్టిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ మంగళవారం తెలిపారు. వివరాల ప్రకారం. అక్టోబర్ 23వ తేదీన రాత్రి క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ అమ్మవారికి పురవీధుల్లో రథోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. స్థానిక కొత్త బస్టాండు పక్క రోడ్డులో పల్లపాటి రమేష్ కారును అమ్మవారి రథం ఢీకొట్టింది. దీనికి ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ డీవీ భాస్కర్, డిప్యూటీ ఇంజనీర్ ఎస్‌వీఎస్ రాజు, ఏఈఓ నటరాజు తదితరుల నిర్లక్ష్యమే కారణమని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు రమేష్ అక్టోబర్ 29న ఇచ్చిన ఫిర్యాదుపై, అదే రోజు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పంటను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం: మినప పంటను ధ్వంసంచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పంగిడిగూడెంకు చెందిన మాండ్రు సూర్యచంద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. వివరాల ప్రకారం మాండ్రు సూర్యచంద్రం తన తమ్ముడి భూమిని సాగు చేస్తున్నాడు. ఆ భూమిలో వేసిన మినప పంటను అదే గ్రామానికి చెందిన మాండ్రు ఇస్సాకు, అతని అల్లుడు వాసుమాల శ్రీను ఈనెల 29 రాత్రి ట్రాక్టర్‌తో దున్నివేశారు. 30వ తేదీ ఉదయం సూర్యచంద్రం పొలానికి వెళ్లేసరికి ఇస్సాకు, శ్రీను ట్రాక్టర్‌తో పొలంలో ఉన్నారని, సూర్యచంద్రాన్ని చూసి వెళ్లిపోయారన్నారు. కాగా, నవంబర్ 5వ తేదీన మినప పంటను తీయడానికి కంపెనీ నుంచి ఆర్డర్ వచ్చిందని, ఈలోగా తనకు నష్టం కలిగించాలనే ఉద్దేశ్యంతోనే ఇస్సాకు, శ్రీనులు పంటను ధ్వంసం చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వ్యక్తి మృతిపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ కోటేశ్వరరావు తెలిపారు. వివరాల ప్రకారం చిన్నంవారిగూడేనికి చెందిన ముప్పిడి రమేష్ తాడువాయికి చెందిన అమలను కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. దసరా సెలవులకు రమేష్ భార్య పిల్లలతో చిన్నవారిగూడెం వచ్చాడు. సెలవులు అనంతరం తిరిగి వెళుతూ తల్లి మేరమ్మకు ఫోన్‌చేసి తాను చనిపోతే గ్రామంలోనే అంత్యక్రియలు చేయాలన్నాడు. కంగారుపడిన తల్లి మేరమ్మ విషయం తెలుసుకోగా, రమేష్ పురుగుమందు తాగాడని, రమేష్ భార్య గమనించి సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం, హైదరాబాద్ ఆసుపత్రులకు తీసుకువెళ్లింది. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 30న రమేష్ మృతిచెందాడు. మృతుని మరణంపై ఎటువంటి అనుమానం లేదని అతని తల్లి ఫిర్యాదులో పేర్కొందని, ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైఎస్సార్ సీపీ డాక్టర్స్ వింగ్ ఉపాధ్యక్షుడిగా శ్రీను



కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ డాక్టర్స్ వింగ్ ఉపాధ్యక్షుడిగా పదవీ బాధ్యతలను స్వీకరించినట్లు కన్నాపురం గ్రామానికి చెందిన డాక్టర్ ఉండుర్తి శ్రీను మంగళవారం పేర్కొన్నారు. జిల్లా డాక్టర్స్ వింగ్ కమిటీని ఇటీవల ప్రకటించారని, జిల్లా అధ్యక్షుడిగా ఏవీఎస్ పద్మరాజు (ఏలూరు) నియమితులైనట్లు ఆయన తెలిపారు. తన నియామకంలో కృషి చేసిన ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు శ్రీను కృతజ్ఞతలు తెలిపారు.